క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయం పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఆలయం విగ్రహం, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు త్రయాహ్నిక దీక్షతో ప్రారంభించారు. తొలి రోజు బుధవారం ఘనంగా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. వేద మంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు వారిశిష్య బృందంతో పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు వల్లూరిపల్లి చక్రవర్తి, మాగంటి వెంకటరత్నం, నాని గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దేవస్థాన అభివృద్ధికి రూ.50 వేల విరాళం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామిదేవాలయ గోపుర అభివృద్ధి పనులకు రూ.50వేలను బుధవారం దాతలు అందించారు. హైదరాబాదుకు చెందిన బండారు రాహుల్, వీణామాధురి దంపతులు ఆలయంలో దశావతార పనుల నిమిత్తం ఈ విరాళాన్ని అందించారని ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ పేర్కొన్నారు.

శిథిలావస్థకు వంతెన



నందివాడ: మండలంలోని నందివాడలో నెహరాలి వంతెన శిథిలావస్థకు చేరింది. మండల కేంద్రం కావడంతో ఈ వంతెనపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. సమీప గ్రామాలైన తుమ్మలపల్లి, రామాపురం, విరివాడ, కుదరవల్లి, ఇలపర్రు తదితర గ్రామాల విద్యార్థులు ఈ వంతెనపై నుంచి గుడివాడకు ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటారు. ధాన్యం, తవుడు, చాప లోడ్ లారీలు, ట్రాక్టర్లు వంతెనపై తిరుగుతుంటాయి. పదేళ్ల నుంచి వంతెన పటిష్టత దెబ్బ తింటోంది. ఖానాలు కూడా పాడయ్యాయి. పాడైన వంతెన స్థానంలో కొత్తగా వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. నేహరాలి ఛానల్ వంతెన పనులకు సంబంధించి అంచనాలు వేసి అధికారులకు పంపామని ఇరిగేషన్ ఏఈ పవన్ తెలిపారు. టెండర్లు పూర్తవ్వగానే పనులు చేస్తామని పేర్కొన్నారు.

దాత సాయంతో వన్నేరు కట్ట గండి పూడ్చివేత

మోపర్రు(పెదపారుపూడి): మోపర్రులోని వన్నెరు డ్రెయిన్‌కు కొన్నినెలల కితం వచ్చిన వరదకు బుడమేరు, వన్నేరు ఉధృతంగా ప్రవహించటంతో డ్రెయిన్ కట్ట తెగి పోయింది. రైతుల ఫిర్యాదులతో డ్రైనేజీ అధికారులు తూతూ మంత్రంగా పని చేసి మమ అనిపించేవారు. పూర్తి స్థాయి పనులు చేయాలని కోరినా డ్రైనేజీ అధికారులు పై నుంచి నిధులు మంజూరు కావడం లేదని చెబుతున్నారని గ్రామస్తుడు బోయిన శివయ్య తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో ఉంటున్న అడ్వొకేట్ సీతంరాజు రామారావు సుమారు రూ.40వేలు ఖర్చు చేసి మట్టితో కట్ట పటిష్టంగా వేశారని రైతు శివయ్య పేర్కొన్నారు. రైతుల కోసం అడగానే స్పందించి వన్నేరు డ్రెయిన్ కట్ట పనులు చేయటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేరుకున్న చెత్త తొలగించండి

గుడివాడటౌన్: స్థానిక టిడ్కో కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం టిడ్కో కాలనీలో పర్యటించి చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్యను కాలనీవాసులు ఎదుర్కొంటున్నారని గతంలో ఫిర్యాదు చేయగా కంటి తుడుపు చర్యగా మున్సిపల్ కమిషనర్ రెండు రోజులు కార్మికులను పంపి చెత్త తొలగించారని, తర్వాత వదిలేశారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే పనులు చేయడం, తర్వాత పట్టించుకోకపోవడం, సరైన విధానం కాదని ప్రత్యేక టీంను ఇక్కడ చెత్త ఎత్తివేయడానికి ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కైకలూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి ఆరోగ్య చెక్కులను కైకలూరు ట్రావెలర్స్ బంగళా వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన ఎనిమిది మందికి రూ.9, 69,128 లక్షల విలువ కలిగిన చెక్కులను అందించారు.

వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం

బంటుమిల్లి: పాశ్చాపురంలోని శ్రీసువర్చాలాంజనేయస్వామి ఆలయంలో బుధవారం అష్టోత్తర (108 కలశాలతో) అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం అభిషేకాలను పండితులు డీవీ మేఘనరసింహాచార్యులు రొంపిచర్ల హనుమంతాచార్యులు చేశారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

- మండవల్లిలో చెత్త సేకరణపై నిర్లక్ష్యం
- రోడ్లపైనే చెత్త, అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- దోమల విజృంభణ

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ రోడ్లపైనే చెత్త దర్శనమిస్తోంది. డ్రెయినేజీ వ్యవస్థ సైతం అస్తవ్యస్తంగా తయారుకావడంతో మురుగునీరు రోడ్లపై నిలిచిపోతోంది. దీంతో దోమలు పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త సేకరణ పక్కనబెట్టిన పంచాయతీలు

మండలంలో సుమారు 10 వేల జనాభా నివసిస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటి చెత్త సేకరణకు వాహనాలను ఏర్పాటు చేసేవారు. సిబ్బందిని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ గ్రామాల్లో ఉన్న ఇంటింటికీ సిబ్బంది వెళ్లి చెత్తను సేకరించడంతో వీధులు పరిశుభ్రంగా ఉండేవి.

ఎక్కడి చెత్త అక్కడే

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెత్త సేకరణను పంచాయతీలు పక్కనబెట్టాయి. దీంతో గ్రామాల్లో అంతర్గత రోడ్లపై చెత్త దర్శనమిస్తోంది. పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు విజృంభించి అంటువ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్య మెరుగునకు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



భీమవరం- విజయవాడ ఆర్అండ్‌బీ రోడ్డుపై మండవల్లి వద్ద పేరుకుపోయిన చెత్త



పెరికెగూడెం ప్రధాన రహదారిపై చెత్త

చర్యలు తీసుకుంటాం

మండలంలోని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– కె.రామలింగేశ్వరరావు, ఎంపీడీఓ, మండవల్లి

వ్యాధులు విజృంభిస్తున్నాయి



గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి దోమలు, కీటకాలు ఎక్కువై అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలి.

– ఎల్ఎస్ భాస్కరరావు, ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చెత్తను తొలగించాలి



గ్రామంలో ఏ వీధి చూసినా చెత్తా, చెదారాలతో దర్శనమిస్తున్నాయి. చెత్తను తొలగించాలని పలుమార్లు సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– టి అప్పారావు, ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి

అకాల వర్షంతో అవస్థలు



తోట్లవల్లూరులో రోడ్లపై నిలిచిన వర్షం నీరు



తోట్లవల్లూరు లంకలో మొక్కజొన్నను పరదాతో కప్పిన రైతు

తోట్లవల్లూరు: అకాల వర్షంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అల్పపీడన ద్రోణి కారణంగా మండల కేంద్రమైన తోట్లవల్లూరుతోపాటు పలు గ్రామాల్లో బుధవారం ఉదయం వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షం నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. కాలనీల్లో అంతర్గత రోడ్లలో సైతం వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థ పడ్డారు. వర్షం కారణంగా వ్యవసాయ పనులు సైతం ముందుకు సాగడం లేదు. లంకల్లో మొక్కజొన్న ఆరబెట్టిన రైతులు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న రాశులపై పరదాలతో కప్పి వర్షం బారి నుంచి కాపాడుకుంటున్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి

కైకలూరు: హనుమజ్జయంతి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం జరగనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని కార్యక్రమ కమిటీ అధ్యక్షుడు బూరుబోయిన శ్రీనివాసరావు(బీఎస్సార్) కోరారు. చావలిపాడు బీఎస్సార్ ఆక్వా దుకాణంలో పోస్టర్‌ను బుధవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బూరుబోయిన మాట్లాడుతూ మధ్యాహ్నం 3.30 గంటలకు కైకలూరు మండలం వింజరం ఆంజనేయస్వామి గుడి వద్ద బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అక్కడ నుంచి కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆంజనేయస్వామి గుడి, ఆటపాక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కడిమి శివబాబు, చింతల బాబూరావు, బొక్క వెంకట్రావు, కందుబోతు నాగరాజు, రుద్రరాజు వెంకట సత్యనారాయణ రాజు, దాసరి శ్రీను, చొప్పల రాము తదితరులు పాల్గొన్నారు.



చావలిపాడులో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూరుబోయిన, కమిటీ సభ్యులు

బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పెడన: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 15 సంవత్సరాలు నుంచి 45 సంవత్సరాలలోపు బాలికలు, మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ పెడన అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ వంగ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ బ్యూటీ థెరపిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణా కాలం మూడు నెలలు ఉంటుంది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణ ఉంటుంది. ఉదయం బ్యూటీషియన్ కోర్సు, మధ్యాహ్నం నుంచి ఆధునిక ల్యాప్‌టాప్‌ల ద్వారా కంప్యూటర్ కోర్స్‌లో శిక్షణ ఇస్తారు. 7, 8, 9, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయినా, లేదా ఇంటర్, డిగ్రీ, డిప్లమా పాస్ లేదా ఫెయిల్ అయినా అర్హులేనన్నారు. అసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు జెరాక్స్, ఒక ఫోటోతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 88977 72488లో సంప్రదించాలన్నారు. శిక్షణ ఈ నెల 26 నుంచి ప్రారంభమై ఆగస్టు 19వ తేదీతో ముగుస్తుంది. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

20 మంది మహిళలకు మేకల పంపిణీ

నాగాయలంక: పేద మహిళలకు ఉపాధి అవకాశం కల్పించే లక్ష్యంతో రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ) జిల్లా సంస్థ ఆధ్వర్యంలో రూ.1.50లక్షల విలువైన 20 మేకలను మహిళా లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈమేరకు నాగాయలంక బోస్ బొమ్మ సెంటర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన మహిళాభ్యుదయం సదస్సులో సంస్థ జిల్లా అధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా అధికారి మేజర్ టి.దీన రత్నకుమారి చేతులమీదుగా మేకలను మహిళలకు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సంస్థ పరిధిలో సేవలు అందిస్తున్న 20 మంది పేద మహిళలను గుర్తించారు. సదస్సులో చెన్నైలోని సంస్థ సీపీ కోఆర్డినేటర్ పి.జీవన్ రాయ్ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు పలు సాధికారత అంశాలను వివరించారు. మహిళా ప్రతినిధులుగా లెఫ్టినెంట్ డి.కోటేశ్వరమ్మ, వకీలాదేవి, ఉష, రాజ్యలక్ష్మి, కేవీ వసంతకుమారి, దేవి, టి.సౌజన్య, సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.



మేకలను స్వీకరించిన మహిళలతో సంస్థ ప్రతినిధులు

విశ్వవిద్యాలయ ఆదేశాలు అమలు చేయాలి

కోనేరుసెంటర్: విశ్వవిద్యాలయం నుంచి వెలువడే ఆదేశాలకు అనుబంధ కళాశాలలు వెంటనే స్పందించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ ఆదేశించారు. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల ప్రధాన ఆచార్యులతో వీసీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర- యోగాంధ్ర కార్యక్రమాలను షెడ్యూల్‌కు అనుగుణంగా క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కృష్ణా విశ్వవిద్యాలయం రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌ను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన ఆచార్యులు లేవనెత్తిన పలు అంశాలపై స్పందించి వాటిని నివృత్తి చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పూడికతీత పనులు



పెదపారుపూడి: పెదపారుపూడిలోని బీసీ ఏరియాలో పంచాయతీ ఆధ్వర్యంలో పూడికతీత పనులను బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి గంటా కృష్ణవేణి మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ లేకుండా ప్రొక్లెయిన్‌తో పూడికతీత పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా రోడ్ల వెంట బ్లీచింగ్ చల్లించామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు.

రాయితీపై పశువుల దాణా



నందివాడ: మండలంలో 50 శాతం రాయితీపై పశువుల దాణాను స్థానిక పశువుల ఆస్పత్రి వద్ద బుధవారం నందివాడ పశు సంవర్ధక శాఖ డాక్టర్ ఎస్.లతశ్రీ పంపిణీ చేశారు. ఈ దాణాలో 25 శాతం మాంసకృత్తులు ఉంటాయని ఆమె పశు పోషకులకు వివరించారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన పశు పోషకులు 50 కిలోల దాణా 1,110 రూపాయలు ఉండగా 50 శాతం రాయితీ పోనూ 555 రూపాయలు మాత్రమే పశుపోషకులు చెల్లించాలన్నారు. మండలానికి 16.3 మెట్రిక్ టన్నుల దాణాను ప్రభుత్వం సరఫరా చేసినట్టు డాక్టర్ లతశ్రీ తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవి, సీహెచ్ సీతయ్య, మూర్తి, అనిత, తొమస్, శ్రీధర్ పశు వైద్య సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం

కలిదిండి (కై కలూరు): నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగంగా చేసుకోవాలని కలిదిండి ఎంపీడీవో వీవీఎస్ఆర్‌కే కొండలరావు చెప్పారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో నెల రోజులు ముందస్తు శిక్షణలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో యోగ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరోగ్యశాఖ ఎంఎల్‌హెచ్‌పీ ఎం.విజయ్‌కుమార్ మాస్టర్ ట్రైనీగా వ్యవహరించారు. వివిధ భంగిమల్లో యోగా పద్ధతులను నేర్పించారు. కార్యక్రమంలో కలిదిండి పీహెచ్‌సీ డాక్టర్ పి.హేమంత్, మండల పరిషత్ సిబ్బంది రమేష్, కలిదిండి, మూలలంక, కోరుకొల్లు వైద్య సిబ్బంది హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సుల కోసం పడిగాపులు



గుడ్లవల్లేరు బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నుంచి విజయవాడ కాశేశ్వరరావు మార్కెట్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. విజయవాడకు ఒక్క గుడ్లవల్లేరు నుంచే కాకుండా డోకిపర్రు, వడ్లమన్నాడు నుంచి కూడా డెయిలీ ఆర్టీసీ సర్వీసు బస్సులు ఉన్నాయి. అయితే ఇవి రెండు, మూడు గంటలపాటు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాల్లో.. మండుటెండల్లో నానా అగచాట్లకు గురవుతున్నారు. కనీసం ఆర్టీసీ బస్సుల సమాచారాన్ని గూగుల్‌లో ఏర్పాటు చేసిన ట్రాక్‌ను కూడా ప్రయాణికులు చూసుకోవడానికి లేకుండా ఆర్టీసీ సిబ్బంది తొలగించారని వాపోతున్నారు. కనీసం తమకు రావలసిన బస్సు ఎంత దూరం వచ్చిందో చూసుకునే అవకాశం కూడా లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి రాక పోవడంతో వర్షాల్లో నిలవలేక.. ఎండకు తాళలేక ప్రయాణికులు అధిక చార్జీలను వెచ్చించుకుని ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా విజయవాడకు వెళ్లే ఆర్టీసీ డైయిలీ సర్వీసు బస్సుల సమయపాలనకు ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆటలు చిన్నారుల జీవితంలో భాగం కావాలి

జమీగొల్వేపల్లి(పామర్రు): ఆటలు చిన్నారుల దైనందిన జీవితంలో భాగం కావాలని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం ఆటల పోటీలపై అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆటలు ఆరోగ్యంతో పాటు బుద్ధి వికాసం కలగడానికి చురుకుదనానికి తోడ్పడతాయన్నారు. ఆటలతో చక్కటి క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తి, ఐకమత్యం వంటి సద్గుణాలు అలవడతాయన్నారు. క్యారమ్స్, చెస్, లూడో, హౌస్, బిజినెస్, చైనీస్ చక్కర్ తదితర ఆటల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో..

ప్రతి రోజూ పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు పేపర్ రీడింగ్‌పై అవగాహన కలిగించారు.



జమీగొల్వేపల్లిలో ఆటల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



పామర్రులో పేపర్ రీడింగ్ చేస్తున్న విద్యార్థులు

ఆధార్‌ను 'స్వర్ణ పంచాయతీ'లో నమోదు చేయండి

గుడ్లవల్లేరు: ఇళ్ల స్థలాల యజమానుల ఆధార్ నంబర్‌ను సేకరించి స్వర్ణ పంచాయతీ పథకంలో భాగంగా నమోదు చేయాలని గ్రామ కార్యదర్శుల్ని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. బుధవారం ఆమె గుడ్లవల్లేరు మండలంలోని చంద్రాల, శేరీ కల్వపూడి, అంగలూరు, గుడ్లవల్లేరులో పర్యటించారు. అందరు పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేసి స్వర్ణ పంచాయతీలోనే పన్ను వసూళ్ల వివరాలను నమోదు చేయాలన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారయ్యే కేంద్రాల్ని ఆమె పరిశీలించారు. త్వరితగతిన వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. వర్మీ ఎరువును స్థానిక రైతుల పొలాల సాగుకు వినియోగించాల్సిందిగా ఆదేశించారు. ప్రతి రోజూ ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా హరిత రాయబారులతో సేకరించవలసినదిగా తెలియజేశారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శానిటేషన్‌లో భాగంగా గ్రామంలో విధులు నిర్వహించే హరిత రాయబారుల పేర్లు, సమయాలు తదితర వివరాలు ఆమె పరిశీలించారు. చంద్రాల గ్రామంలో గ్రామ పంచాయతీ ఏరియాలోని ప్రభుత్వ పాఠశాలలో వెజిటబుల్ ఎసెట్‌లో భాగంగా దాతల సహకారంతో ఆట వస్తువులను ఏర్పాటు చేసి పార్క్‌గా తయారు చేసిన దాతలు, ఉద్యోగులను ఆమె అభినందించారు. శేరీ కల్వపూడి లోన పంచాయతీ ఏరియాలోని సచివాలయం ఎదురు స్థలంలో వెజిటబుల్ ఎసెట్‌లో భాగంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీని అభినందించారు.



జిమ్ వస్తువులను పరిశీలిస్తున్న డీపీఓ అరుణ

మట్టిదారులు

రిమ్మనపూడి(పామర్రు): రిమ్మనపూడి చెరువు మట్టిని ప్రధాన రహదార్ల మీదుగా తరలించిన మట్టి మాఫియా పనులు పూర్తవ్వగానే వదిలేసి వెళ్లి పోయారని దీంతో రహదార్లు అధ్వానంగా మారాయని స్థానిక ఎంపీటీసీ తలారి మహేష్ పేర్కొన్నారు. బుధవారం రిమ్మనపూడి గ్రామంలోని రహదార్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి మట్టిమయంగా మారడంతో ఎంతోమంది ప్రమాదాలకు గురవుతున్నారు. మట్టి తోలుకున్న వారు కనీసం రహదారిపై బ్లేడ్‌తో మట్టిని తొలగించే పనులు కూడా చేయక పోవడంతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా రిమ్మనపూడి వెళ్లే రహదారి

సంక్షిప్త వార్తలు

కోతులకు కొండముచ్చుతో చెక్



చినముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలంలోని చినముత్తేవి గ్రామంలో స్వైరవిహారం చేస్తున్న కోతులను తరిమేయడానికి పంచాయతీ అధికారులు కొండముచ్చును ప్రయోగించారు. గ్రామ ప్రజల నుంచి మంగళవారం ఫిర్యాదు అందిన నేపథ్యంలో చినముత్తేవి సర్పంచ్ కొమ్ము సౌధామణి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి మదిరి ప్రవీణ్ సమీప గ్రామంలోని అవురుపూడి నుంచి బుధవారం కిరాయికి కొండముచ్చును తీసుకువచ్చి గ్రామంలో తిప్పించడంతో అవి పరారైనట్లు సమాచారం. కొండముచ్చును గ్రామంలో తిప్పడంతో కొంత ఫలితం కనపడిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

రైల్వే గేట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గం పరిధిలో రైల్వే గేట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే రాము తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, నేషనల్ హైవే, రైల్వే, మోర్త, పోలీసు, శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం భీమవరం రైల్వే లైన్లలోని రైల్వే గేట్లకు సంబంధించి ఫ్లై ఓవర్ లేదా అండర్పాస్ నిర్మాణాలు మొత్తం 8 యూనిట్లుగా గుర్తించామనన్నారు వాటి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.400 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. బేతవోలు, ధనియాలపేట, కేటీఆర్ కళాశాల రోడ్, మందపాడు, రూరల్ మండలం మోటూరు, బొమ్ములూరు, గుడ్లవల్లేరు మండలం ఇంజినీరింగ్ కళాశాల వద్ద, డోకిపర్రు సమీపంలోని రైల్వే గేట్ల వద్ద అనుకూలత మేరకు అండర్పాస్ లేదా ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో రైల్వే సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం డి.ఎస్.పి ధీరజ్ వినీల్, నేషనల్ హైవే డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమత్ జయంతి

నాగాయలంక: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమత్ జయంతి ఉత్సవాలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. భావ దేవరపల్లి గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం 36వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త మలిశెట్టి సాంబశివరావు(నామాలు)తెలిపారు. రేమాలవారిపాలెంలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో 108 పర్యాయాలు చాలీసా జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. వక్కపట్లవారిపాలెం, మర్రిపాలెం గ్రామాల్లోని అభయాంజనేయుని దేవస్థానాలలో ప్రత్యేక ఆకుపూజ, చాలీసా పారాయణం, పూజాధికాలు జరుగుతాయి. ఆయా వేడుకల్లో భక్తులకు భారీ అన్నసంతర్పణ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.